DD9 వార్త

తెలుగు దినపత్రిక

గురువారం, అక్టోబర్ 09, 2025


## అత్యాశలో అవినీతి సీఐ




- ఎస్ఐగా పనిచేసిన చోటే.. ఎస్ హెచ్ ఓగా చేయాలని తహతహ
- ఆయన టార్గెట్ అంతా ..ఫోకల్ పోస్టింగుల పైనే
- ఏళ్లుగా సిటీలోనే తిష్ట.. మ్యానేజ్ చేస్తూ చక్రం తిప్పుతున్న సీఐ
- పోలీసు బాస్ లకు ఫోన్ కాల్స్ చేయించడంలో నేర్పరి
- పైకి సమాజసేవ.. తెరవెనుక లక్షల్లో సంపాదన
- హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ లో.. చర్చనీయాంశంగా మారిన సీఐ వ్యవహారం

8లో




# మన వీరయ్య.. మళ్లీ ములుగొస్తున్నారు

### పుట్టింటికి పొదెం రీఎంట్రీ




- నిజాయితీ తిరిగొస్తున్న వేళ.. వీరయ్య అభిమానుల ఆనంద హేళ
- "హస్త" రాజకీయాల్లో సరి కొత్త పరిణామాలు
- పొదెం పునరాగమనంపై ఎన్నెన్నో ఊహాగానాలు
- చర్చనీయాంశంగా ములుగు రాజకీయాలు
- కాంగ్రెస్ లో కొత్త సమీకరణాలు
- వీరయ్య వస్తేనే విలువైన రాజకీయాలు
- ఇవే జిల్లాలో అసలైన కార్యకర్తల అభిప్రాయాలు

2లో

ములుగు జిల్లాలో అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు పండుగ చేసుకునే వార్త ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హల్ చల్ చేస్తుంది. త్యాగాలకు తావులేని రాజకీయాల్లో అధిష్టానం ఆదేశాలకు శిరస్సు వంచిన ఓ కరుడుగట్టిన కాంగ్రెస్ వాది తిరిగి తన పుట్టింటి రాజకీయాల్లో కీలకంగా మారేందుకు తిరిగి వచ్చేస్తున్నారు. అటు పార్టీ పరంగా ఇటు ప్రజల గుండెల్లో సైతం అందరివాడేలా ఉండే ఆయన కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చిన మాట కోసం తన సొంత ఇంటిని వదిలి వెళ్లారు. మంచితనానికి కేరాఫ్ అడ్రస్ గా ఉన్న ఆయన్ను పక్క జిల్లా ప్రజల సైతం ఆదరించారు. పారదర్శకమైన రాజకీయవేత్తగా ప్రజా మన్ననలు పొందిన ఆయన నిబద్ధత కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ విధేయుడి గానే ఉంటూ వస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా మంత్రి పదవులు ఇస్తామంటూ అధికార పార్టీ నుండి ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని కూర్చున్నారు. తన పార్టీ అధికారంలోకి వస్తే తనకు సముచితమైన స్థానం దక్కుతుందని ఆశాభావంతో నైతిక విలువలకు కట్టుబడి ఉన్న ఆయన ప్రస్తుతం ములుగు జిల్లా రాజకీయాల్లోకి పునః ప్రవేశం చేస్తున్నట్లుగా జరుగుతున్న ప్రచారం అక్కడ రాజకీయ పరిస్థితులను పూర్తిగా మార్చి వేస్తాయనే అభిప్రాయాలకు ఆస్కా రమిస్తున్నాయి .. ములుగు జిల్లాలో ఆయన రీయంట్రీ హాట్ టాపిక్ గా మారిపోయింది. ఇంతకీ ఆయన ఎవరో తెలుసుకోవాలని ఉందా.. ఆయనే పొదెం వీరయ్య...

- డిడి 9 వార్త, మంగపేట

## ఆరేళ్ల నిరీక్షణకు తెర




- భద్రాచలంలో తొలి పరిషత్ సమరానికి సై!
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ఎన్నికలు
- జెడ్పీటీసీ బీసీ మహిళకు, ఎంపీపీ ఎస్టీ మహిళకు రిజర్వ్
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ తో భద్రాద్రి లో వేడెక్కుతున్న రాజకీయం
- హైకోర్టు తీర్పుపై అభ్యర్థుల్లో ఉత్కంఠ, ఆందోళన

3లో

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఆరు సంవత్సరాలుగా స్తంభించిపోయిన భద్రాచలం రాజకీయ ముఖచిత్రంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. విలీన గ్రామాల వివాదాలు, మున్సిపల్ హోదా సమస్యలతో సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మండల పరిషత్ (ఎంపీటీసీ/జెడ్పీటీసీ) ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భద్రాచలంలో జరుగుతున్న మొట్టమొదటి మండల పరిషత్ ఎన్నికలు ఇవే కావడం విశేషం. రాష్ట్రమంతటా స్థానిక ఎన్నికలు పూర్తయినా, 2018 నుంచి ఇక్కడ పాలకవర్గం లేకుండానే పాలన సాగుతోంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోయే పోలింగ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది.

- భద్రాచలం, (డిడి9 వార్త )

## ఏసీ బస్సులో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రూ. 11 లక్షల విలువైన 20 కేజీల గంజాయి స్వాధీనం
- గతంలోనూ పట్టుబడిన నిందితుడి అరెస్ట్
- రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మెరుపుదాడి

5లో




## భద్రాచలంలో 'టాస్క్ ఫోర్స్' కొరడా

- రూ. 10 లక్షల అక్రమ టపాసులు సీజ్,
- నలుగురిపై కేసు నమోదు!

7లో










# మన వీరయ్య.. మళ్లీ ములుగొస్తున్నారు

## పుట్టింటికి పొదెం రీఎంట్రీ

- నిజాయితీ తిరిగొస్తున్న వేళ.. వీరయ్య అభిమానుల ఆనంద హేళ
- "హస్త" రాజకీయాల్లో సరి కొత్త పరిణామాలు
- పొదెం పునరాగమనంపై ఎన్నెన్నో ఊహాగానాలు
- చర్చనీయాంశంగా ములుగు రాజకీయాలు
- కాంగ్రెస్ లో కొత్త సమీకరణాలు
- వీరయ్య వస్తేనే విలువైన రాజకీయాలు
- ఇవే జిల్లాలో అసలైన కార్యకర్తల అభిప్రాయాలు

**డిడి 9 వార్త మంగపేట :** ఆయన త్యాగం.. కొందరికి అధికార దర్పానిచ్చింది.. నిబద్ధతగల కాంగ్రెస్ వాదిగా అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి తనకు పట్టున్న సీటును తృణప్రాయంగా వదిలేయడంతో అది కొందరికి వరమైంది. వీరయ్య త్యాగాల పునాదుల మీద నేడు కొందరు అరుదైన పీఠాన్ని ఆవిష్కరించి అందలాలెక్కారు.. పాపం త్యాగం చేసిన ఆయన మాత్రం అవేమీ పట్టించుకోకుండా కాంగ్రెస్ విధేయుడిగానే చలామణి అవుతున్నారు.. పొదెం వీరయ్య... రాష్ట్ర రాజకీయాల్లో సుపరిచితమైన వ్యక్తి... ములుగు జిల్లాలో అందరివాడిగా ముద్ర వేసుకున్న అరుదైన మనిషి. రాజకీయాల్లో గోడ దూకడం పదవుల కోసం ఎంతటి పాపానికైనా ఒడిగట్టడం వంటి పరిస్థితులకే చోటు ఉన్న నేపథ్యంలో కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా కాంగ్రెస్ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటూ పదవులను సైతం ఫణంగా పెట్టేశారు.

### ములుగు రాజకీయాల్లో కీలకం..

అలాంటి ఆయన తాజాగా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ములుగు రాజకీయ ముఖచిత్రంలో సరికొత్త పరిణామాలకు దోహదపడుతున్నాయి మాజీ భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తిరిగి ములుగు రాజకీయాల్లో కీలకంగా మారేందుకు సిద్ధమయ్యారని వార్త ఆయన అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతుండగా ప్రత్యర్థుల్లో మాత్రం గుబులు రేపుతుంది. ముఖ్యంగా ఆయన త్యాగాల ఫలితంగా లబ్ధి పొందిన వారు వీరయ్య రీ ఎంట్రీ వార్తతో అయోమయానికి గురవుతున్నట్లు సమాచారం. ములుగు జిల్లాలో అందరివాడిగా పేరున్న వీరయ్య కొన్ని రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పెద్దల ఆదేశాల మేరకు తన సొంత ప్రాంతాన్ని వదిలి భద్రాచలం ఎమ్మెల్యేగా పోటీ చేసి అక్కడ సైతం విజయాన్ని సొంతం చేసుకున్నారు. కేవలం అధిష్టానం మాట కట్టుబడి తన స్థానిక తన సైతం ఫణంగా పెట్టి పక్క జిల్లాకు వచ్చి అక్కడి ప్రజల మండల సైతం పొందిన వీరయ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటికీ అప్పట్లో అధికారంలో ఉన్న బి ఆర్ఎస్ పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన లొంగకుండా పార్టీ నే అంటిపెట్టుకొని ఉన్నాడు. అనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ వీరయ్య భద్రాచలంలో ఓటమిపాలయ్యారు. ఈ క్రమంలో ప్రలోభాలకు లొంగకుండా పార్టీని వీడకుండా ఉన్న వీరయ్య కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ ను ఆయన అభిమానులు తెరపైకి తీసుకొచ్చారు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ముద్రపడిన వీరయ్య కు అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులు పెద్దగా లభించలేదు. ఆయనకు ఓ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించే ప్రయత్నాలు చేశారు. అయితే ఆ చైర్మన్ గిరి పై వీరయ్య అసంతృప్తి గాని ఉన్నట్లు తెలుస్తోంది.. భద్రాచలం ఎమ్మెల్యేగా టిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన తెల్లం వెంకట్రావు అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ వైపుకు దూకడంతో వీరయ్యలో నెలకొని ఉన్న అసంతృప్తి తీవ్రమైన అసహనంగా మారిపోయింది. ఈ క్రమంలో భద్రాచలం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చలామణి అవుతూ విమర్శల పాలవుతూ వస్తుంది. అయితే ఇటీవల కాలంలో వీరయ్య ములుగు రాజకీయాల వైపు ఆసక్తిని చూస్తున్నట్టుగా ప్రచారం జరుగుతూ వస్తుంది.









### త్యాగానికి ప్రతిఫలం.. జడ్పీపీఠం

అధిష్టానం ఆదేశాల మేరకు తనకు అత్యంత పట్టుకున్న ప్రాంతంలో ఎమ్మెల్యే సీటును వదులుకొని పక్క జిల్లాకు వెళ్లిన పొదెం వీరయ్య త్యాగానికి సంబంధించి ఋణం తీసుకునే అవకాశం ప్రస్తుతం అధికార పార్టీకి వచ్చిందని ఆ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై వీరయ్య సతీమణి కూర్చోబెట్టే విధంగా అటు అధిష్టానంతో పాటు ఇటు ఆయన త్యాగఫలంగా లబ్ధి పొందిన వ్యక్తుల సైతం ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ములుగు జడ్పీ చైర్మన్ ను ఎస్టి మహిళకు కేటాయించిన నేపథ్యంలో వీరయ్య సతీమణికి చైర్మన్ గా అవకాశం ఇచ్చినట్లయితే అధిష్టానం పట్ల ఆయన చూపించిన విధేయతకు న్యాయం చేసినట్లు అవుతుందనే భావన ఆయన అభిమానులతో పాటు మెజారిటీ కాంగ్రెస్ కార్యకర్తల్లో నెలకొని ఉంది. వీరయ్య ములుగు రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చినట్లయితే ఆయనకంటూ ఓ ప్రత్యేకమైన ప్రాధాన్యత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రస్తుత రిజర్వేషన్ ఆధారంగా ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ గిరిని కైవసం చేసుకునేందుకు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారు జడ్పీ చైర్మన్ తామే అన్నట్లుగా ఊహ లోకాల్లో విహరిస్తున్న వారికి వీరయ్య ములుగులోకి ప్రవేశిస్తున్నాడని సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కి పడుతున్నారు. జడ్పీ చైర్మన్ సీట్ కోసం ఒకవేళ వీరయ్య అధిష్టానం వద్ద గట్టిగా ప్రయత్నాలు చేస్తే ఆయన త్యాగానికి ప్రతిఫలంగా కాంగ్రెస్ హై కమాండ్ వీరయ్యకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే తమ బ్రతుకు బస్టాండ్ అన్న అభిప్రాయంలో ఆశావాహులు ఉన్నారు. ఒకవేళ పొదెం ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ సీట్ కోసం గట్టిగా పట్టుబడితే ములుగు కాంగ్రెస్ లో ముసలం కచ్చితంగా వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి. ఆయన చేసిన త్యాగం కారణంగానే విలువైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఆ ఋణం తీసుకునే దిశగా ఆలోచన చేస్తే వివాదాలకు దూరంగానే వీరయ్య త్యాగానికి ఒక ప్రతిఫలం లభించినట్లు అవుతుంది.

### సొంత ఇంటికి రీ ఎంట్రీ

పొదెం వీరయ్య తన సొంత ప్రాంతమైన ములుగు జిల్లా వైపు చూస్తున్న నేపథ్యంలో అక్కడ ఆయన అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. నిజాయితీ నిబద్ధతతో కూడిన రాజకీయాలకుఊ తమిచ్చే వీరయ్యలాంటి వ్యక్తి తిరిగి సొంతింటివైపు చూడడం శుభపరిణామమనే అభిప్రాయాలు అక్కడ వ్యక్తం అవుతున్నాయి. ములుగు జిల్లాలో ఒక బలమైన నాయకుడుగా పేరు ఉన్న వీరయ్య తిరిగి అదే జిల్లాలో పునః రాజకీయాలకు శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేస్తున్నారనే ప్రచారం అదే పార్టీలోని కొందరికి మింగుడు పడటం లేదంట. వీరయ్య రావడం వల్ల ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి విశ్వసనీయతో కూడిన రాజకీయాలు తిరిగి ప్రారంభమవుతాయని ఆశాభావాన్ని ఆ పార్టీకి చెందిన స్వచ్ఛమైన కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

# ఆరేళ్ల నిరీక్షణకు తెర

- **భద్రాచలంలో తొలి పరిషత్ సమరానికి సై!**
- **తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ఎన్నికలు**
- **జెడ్పీటీసీ బీసీ మహిళకు, ఎంపీపీ ఎస్టీ మహిళకు రిజర్వ్**
- **నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ తో భద్రాద్రి లో వేడెక్కుతున్న రాజకీయం**
- **హైకోర్టు తీర్పుపై అభ్యర్థుల్లో ఉత్కంఠ, ఆందోళన**




**భద్రాచలం, అక్టోబర్ 08 (డిడి9 వార్త )**

స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఆరు సంవత్సరాలుగా స్తంభించిపోయిన భద్రాచలం రాజకీయ ముఖచిత్రంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. విలీన గ్రామాల వివాదాలు, మున్సిపల్ హోదా సమస్యలతో సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న మండల పరిషత్ (ఎంపీటీసీ/జెడ్పీటీసీ) ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భద్రాచలంలో జరుగుతున్న మొట్టమొదటి మండల పరిషత్ ఎన్నికలు ఇవే కావడం విశేషం.

రాష్ట్రమంతటా స్థానిక ఎన్నికలు పూర్తయినా, 2018 నుంచి ఇక్కడ పాలక వర్గం లేకుండానే పాలన సాగుతోంది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోయే పోలింగ్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది.

మండల పరిషత్‌కు పూర్వ వైభవం వెనుక రాజకీయం

జనవరి 1, 1987న ఏర్పడిన భద్రాచలం మండల పరిషత్, రాష్ట్ర విభజన అనంతరం ముంపు గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో నిర్వీర్యమైంది. పాలకవర్గం కాలపరిమితి 2018లో ముగిసిన తర్వాత, ఈ పరిషత్‌ను కొత్తగా ఏర్పాటైన ఆళ్లపల్లి మండలానికి తరలించారు. అయితే, ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని నెలల క్రితం తిరిగి భద్రాచలానికి మండల పరిషత్‌ను కేటాయించింది. ఈ కీలక నిర్ణయంతోనే ఇక్కడ ఎన్నికలకు మార్గం సుగమమైంది.

**కీలక మార్పులు, రిజర్వేషన్లు**

గతంలో 13గా ఉన్న ఎంపీటీసీ స్థానాలు ప్రస్తుతం 14కు పెరిగాయి. కీలకమైన జెడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించబడింది. మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) పదవిని గిరిజన (ఎస్టీ) మహిళకు రిజర్వ్ చేశారు. మొత్తం 20 వార్డుల్లో ఎన్నికల నిర్వహణ కోసం 60 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు.

**ఉత్కంఠలో అధికార, ప్రతిపక్ష పార్టీలు**

సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో, అన్ని రాజకీయ పార్టీలు ఈ స్థానిక సమరాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. జెడ్పీటీసీ స్థానానికి విపరీతమైన ఆశావాహులు ఉండటంతో, టికెట్ దక్కించుకోవడం నాయకులకు సవాల్‌గా మారింది. సమీకరణాల్లో మునిగిపోయిన అభ్యర్థులు టికెట్ ఖరారు కోసం పార్టీ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**హైకోర్టు తీర్పుపైనే అభ్యర్థుల దృష్టి**

మరోవైపు, నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, స్థానిక ఎన్నికలకు సంబంధించి నేడు హైకోర్టు ఇవ్వబోయే తుది తీర్పుపైనే అభ్యర్థులు, రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృతమై ఉంది. తీర్పు అనుకూలంగా వస్తే ప్రక్రియ వేగవంతం కానుంది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక పాలకవర్గాన్ని ఎన్నుకోవడమే కాకుండా, భద్రాచలం ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు, ప్రతిపక్ష పార్టీల బలానికి నిదర్శనంగా నిలవనున్నాయి. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ప్రజలు ఎలాంటి తీర్పు ఇవ్వనున్నారో అనే చర్చ ఇప్పుడు స్థానికంగా జోరుగా సాగుతోంది.

## జిల్లా కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి

# కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

**మంగపేట, అక్టోబర్ 08(డిడి9 వార్త)**

ములుగు జిల్లా మంగపేట మండలంలో కోడెల నరేష్ అను నేను కాంగ్రెస్ పార్టీలో ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా గత కొన్ని సంవత్సరాలనుండి నిస్వార్థంగా పని చేసాను నేను ఎలాంటి వాన్నో పార్టీ నాయకులకు మండల ప్రజలకు తెలుసు కానీ కొంతమంది బడా చోటా నాయకులు నామీద అధిష్టానానికి తప్పుడు సమాచారం ఇస్తూ నన్ను పార్టీలో ఎదగనీయకుండా నన్ను అవసరాలకు వాడుకొని నన్ను చాలా రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు చెప్పుడు మాటలు పట్టుకొని కష్టపడ్డోళ్లను దూరం చేసుకుంటు కొంతమంది కాంగ్రెస్ పార్టీలో ఉంటూ వేరే పార్టీకి కొమ్ము కాసేటోళ్లను గుర్తించలేకపోతున్నారు మండల పార్టీ నాయకులు ఇక్కడ మొత్తం పాజిటివ్ గా ఉంది మొత్తం మన వాళ్లేనని మొత్తం వన్ సైడ్ అని తప్పుడు రిపోర్ట్ ఇస్తున్నారు పైన ఉన్న అధిష్టానం కూడా ఇది నిజం అని నమ్ముతుంది కానీ ఇక్కడ జరుగుతుంది వేరు ఇప్పుడు జరగబోయే జడ్పీటీసీ ఎలక్షన్ లో ప్రజలే సరైన తీర్పు ఇస్తారని కష్టపడ్డోళ్లను పక్కనపెట్టి చెప్పుడు మాటలు చెప్పేటోళ్లను నమ్ముతూ మోసపోవద్దన సీతక్క ఈ విషయాన్ని గమనించగలరని కోరుకుంటూ సీతక్క గారు అంటే నాకు అప్పుడు ఇప్పుడూ ఎప్పటికీ గౌరవమే ఉంటుంది కానీ కొంతమంది సీతక్క ని మోసం చేస్తు వారి తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం పార్టీలో ఉంటూ బయట తప్పుడు ప్రచారం చేస్తున్నారు ఇలాంటి వారిని పార్టీ గుర్తించి వీరిని పార్టీ నుంచి దూరం పెట్టాలని సీతక్క ని కోరుకుంటున్నాం గెలుపు కోసం కష్టపడిన వాళ్ళను దూరం చేస్తున్నారు పార్టీ కోసం కష్ట పడని వాళ్ళను దగ్గరికి చేసుకొని నిస్వార్థం గా పనిచేసిన వాళ్ళను మీరు బాధ పెడుతున్నారు అయిన కూడా పార్టీకి మా సొంతపనులను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ కోసం సీతక్క మీద అభిమానం కోసం కష్టపడ్డా మీకు తెలియదా అక్క నేను ఎలాంటి వాన్నో మీ కోసం ఎప్పటి నుంచి కష్టపడ్డానో నిన్న గాక మొన్న వచ్చిన వాళ్ళు పెత్తనం చేలాయిస్తున్నారు ముందునుంచి కష్టపడ్డ వారికి పార్టీలో ఎలాంటి గుర్తింపు లేదు ఇవ్వరు కూడా అన్నిటికీ తట్టుకొని ఇవాళ కాకా పోతే రేపు ఐన తెలుసుకుంటారని చూశాం కానీ ఎలాంటి మార్పు లేనప్పటికీ అందుకే నేను ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అక్క నా బాధను అర్థం చేసుకుంటారని ఆశిస్తూ ఇప్పటికైనా పార్టీలో కష్టపడ్డవారికి ముందు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటూ కాంగ్రెస్ పార్టీకి నేను రాజీనామా చే స్తు న్నా న ని మీడియా మిత్రుల ధ్వారా తెలియజేస్తున్నాను మంగపేట మం డ లం లో జడ్పీటీసీ గా పోటీ చేయాలని నిర్ణయం తీ సు కు న్నా ను విలువ లేని చోట పని చేయడం ఎందుకు అని ఈ నిర్ణయం తీసుకున్నాను గౌరవనీయులైన మంత్రి వర్యులు సీతక్క ఇప్పటికైనా లోకల్ లీడర్ల తో కాకుండా ఇంటిలిజెన్స్ గ్రౌండ్ లెవల్లో సర్వే చేసి ఎవరు ఎలాంటి వారో తెలుసుకోవాల్సిందిగా కోరుకుంటూ ఇప్పుడైనా సరైన నిర్ణయం తీసుకొని కొంతమంది కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ వేరే పార్టీకి సపోర్ట్ చేస్తూ అధిష్టానానికి తప్పుడు రిపోర్ట్ ఇస్తూ కాంగ్రెస్ పార్టీని మోసం చేస్తున్న వారిని పట్టుకొని వారికి తగిన గుణపాఠం చెప్పి వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుకుంటున్నాం






# ప్రజా పోరాటాలను బలోపేతం చేయడమే

- **జీవికి మనమిచ్చే ఘనమైన నివాళి**
- **సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ**

**వెంకటాపురం. డి డి 9 వార్త అక్టోబర్ 08..**

ఏజెన్సీలో సిపిఎం పోరాటాలను బలోపేతం చేయడమే గుర్రం వెంకటేశ్వర్లు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఐ ఎం పార్టీ కార్యాలయం ఆవరణలో కామ్రేడ్ గుర్రం వెంకటేశ్వరరావు 15వ వర్ధంతి సభ గ్యానం వాసు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి రెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. ఒంగోలు నుండి బతుకుదెరువు కోసం వెంకటాపురం వచ్చిన గుర్రం వెంకటేశ్వరరావు సిపిఐ ఎం పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాల పట్ల ఆకర్షితులయ్యారన్నారు. మండలంలో సిపిఐ ఎం పార్టీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న గుర్రం వెంకటేశ్వరరావు. పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ మండల కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు తనకున్న వ్యాపారాలను పక్కనపెట్టి పార్టీ కోసం పూర్తి కాలం కార్యకర్తగా పనిచేసిన వ్యక్తి గుర్రం వెంకటేశ్వర్లు అన్నారు. ఎర్ర జెండా ఊపిరిగా కడవరకు మార్క్సిజం వీడని వ్యక్తి జీవి అన్నారు. మండలంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలందరూ ముందుండి పనిచేయడమే జీవికి మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. తోలుతా జీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శ్రీను, కట్ల చారి, మండల కమిటీ సభ్యులు దేవమని, నరసింహారావు, పరిశీక రాంబాబు, తోట నాగేశ్వరరావు, గుర్రం పుల్లారావు పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.



# బాకీ కార్డు..

- **కాంగ్రెస్ మీద బీఆర్ఎస్ సంధించిన బ్రహ్మాస్త్రం**

**ఏటూరునాగారం,అక్టోబర్ 08(డిడి-9వార్త )**

● అలవిగాని 420 హామీలను ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి, తీరా గెలిచాక హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం.

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుతో,

● ములుగు జిల్లా బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు .. ● పల్లె పల్లెకు గ్రామ గ్రామానికి తిరుక్కుంటూ

● క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి లక్ష్మణ్ బాబు

● ఏటురూనాగారం మండలం చల్పాక గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఏ వర్గానికి ఎంత బాకీ పడ్డారో కాంగ్రెస్ బాకీ కార్డులను పంచి, ప్రజలకు కాంగ్రెస్ మోసాలని తెలియజేస్తున్నారు.

● ఎన్నికల్లో ఓట్ల కోసం మీ ఇండ్లకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ఈ బాకీ కార్డులు చూపించి నిలదీయండి అని లక్ష్మణ్ బాబు ప్రజలను కోరడం జరుగుతుంది

● ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి , కాకులమర్రి ప్రదీప్ రావు , తాడూరి రఘు, మాజీ ఎంపీటీసీ కోట నరసింహులు, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, చల్పాక గ్రామ కమిటీ అధ్యక్షులు బోడ శంకర్ , కుదురుపాక కృష్ణ,ఆలం స్వామి, మడప శంకరయ్య,ఈసం జానకమ్మ, కర్న వెంకటేష్,ఆలం సబిత, అట్టం సత్యనారాయణ,అంతటి సంతోష్, శివుడు,సకినాల రాకేష్,కోడిప బాబురావు,కోరం సుధాకర్,కర్న గోపి,బందెల ప్రవిన్,కర్న మహేష్,పడిదలు నరేష్,సకినాల నవిన్, ఆదినారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది

# హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐగా పదోన్నతి

- **ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎస్ఐ భాస్కర్**

**భద్రాచలం అక్టోబర్ 08 ( డిడి 9 వార్త)**

భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్లో గత కొంతకాలంగా హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి. భాస్కర్ కు అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) గా పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం రోజున జిల్లా పోలీస్ అధికారి ఎస్పీ రోహిత్ రాజు ను మర్యాదపూర్వకంగా పదోన్నతి పొందిన భాస్కర్ ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలియజేసి పుష్పగుచ్ఛం అందించారు. భాస్కర్ గారి సేవలను, కృషిని ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు గారు అభినందించారు. భాస్కర్ గారికి నూతన హోదాలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ భాస్కర్ మాట్లాడుతూ, తనకు పదోన్నతి లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజలకు మరింత అంకితభావంతో సేవ చేస్తానని పేర్కొన్నారు.







# కాంగ్రెస్ మోసాల 'బాకీ కార్డు' పంపిణీ

- **దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం...**
- **స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పిలుపు!**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎంత చెల్లించాలో లెక్క చెప్పిన బీఆర్ఎస్**

**వెంకటాపురం నూగురు అక్టోబర్ 08 (డిడి9 వార్త)**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం '420 హామీలతో' ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ఆ హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టేందుకు భారత్ రాష్ట్ర సమితి పార్టీ 'కాంగ్రెస్ బాకీ కార్డు' పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేసింది. ఇందులో భాగంగా, ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఈ " మోసాల కార్డు' ను విడుదల చేసి ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అందజేశారు. రైతులు, మహిళలు, దివ్యాంగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన 'బాకీ' వివరాలు: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప రాంబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. 22 నెలల క్రితం కాంగ్రెస్ ఇచ్చిన అంతులేని హామీలన్నీ అబద్ధాలుగా మిగిలిపోయాయని ఆయన మండిపడ్డారు. ఈ బాకీ కార్డు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఏఏ హామీల కింద ఎంత మొత్తం చెల్లించాలో కళ్లకు కట్టినట్టుగా లెక్క చూపారు.

**బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డులో ప్రముఖంగా ప్రస్తావించిన అంశాలు:**

రైతు భరోసా: నాలుగు ఎకరాల రైతులకు చెల్లించాల్సిన మొత్తం బాకీ. మహిళలకు ఆర్థిక సాయం: నెలకు రూ. 2,500 చొప్పున మహిళలకు చెల్లించాల్సిన మొత్తం. చేయూత, దివ్యాంగుల పింఛన్లు: దివ్యాంగులకు నెలకు రూ. 6 వేల చొప్పున చెల్లించాల్సిన పెండింగ్ బకాయి.

కల్యాణలక్ష్మి/షాదీముబారక్, తులం బంగారం: ఈ పథకాలతో పాటు విద్యా భరోసా కార్డు కింద చెల్లించాల్సిన మొత్తం.

కౌలు రైతులు, రైతు కూలీలు: వీరికి ఇప్పటి వరకు చెల్లించాల్సిన మొత్తాలు.

**స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి**

ఈ సందర్భంగా గంప రాంబాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అబద్ధపు వాగ్దానాల చిట్టాను ఈ 'బాకీ కార్డు' ద్వారా ఇంటింటికీ తీసుకెళ్తామని తెలిపారు. రైతులు, మహిళలు, వృద్ధులు, పింఛన్‌దారులు కాంగ్రెస్ మోసాన్ని గుర్తించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి దర్ర దామోదర్, సీనియర్ నాయకులు వేల్పూరి లక్ష్మీ నారాయణ, చిట్టెం రవికుమార్, ముడుంబా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర శివాజీ యాదవ్, యూత్ అధ్యక్షులు కొండపర్తి నాని, లడ్డు రాజేష్, నమన సాయి, శాంత మూర్తి యాదవ్, యువ నాయకులు గడ్డం వివేక్, మాజీ వార్డు సభ్యులు కిరణ్, వేల్పూరి రవి, కన్నా రెడ్డి, ఆదినారాయణ, మాజీ మహిళా అధ్యక్షురాలు జానకమ్మ పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు బహుజన్ సమాజ్ పార్టీ సన్నద్ధం: చర్లలో అన్ని స్థానాల్లో పోటీ

- **ఓట్లు మావీ, సీట్లు మీవా... ఇక చెల్లదు: కొండా కౌశిక్**

**చర్ల అక్టోబర్ 8 డిడి9 వార్త**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీ చేసేందుకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్ధమైంది. చర్ల మండల పరిధిలోని 12 ఎంపీటీసీ మరియు ఒక జెడ్పీటీసీ స్థానాలకు అన్నింటిలోనూ ఏనుగు గుర్తుపైనే పోటీ చేస్తామని బీఎస్పీ చర్ల మండల అధ్యక్షులు కొండా కౌశిక్ స్పష్టం చేశారు. బుధవారం నాడు చర్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంలో కొండా కౌశిక్ మాట్లాడుతూ, "ఓట్లు మావీ, సీట్లు మీవా... ఇక చెల్లదు, చెల్లదు, చెల్లదు" అంటూ పాత విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా కొట్లాడే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని ఆయన అన్నారు.




**అభివృద్ధి శూన్యం, అధికారం ఇవ్వండి:**

దశాబ్దాల కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్) పార్టీల హయాంలో ఈ ప్రాంతంలో అభివృద్ధి శూన్యమని కొండా కౌశిక్ ఆరోపించారు. చర్ల మండల ప్రజానీకం ఈ విషయాన్ని గమనించాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీకి అధికారం ఇస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకుంటుందని, ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

**బానిసత్వం పోవాలంటే బహుజనుల ఐక్యత ముఖ్యం:**

బహుజన జాతి బిడ్డలందరూ ఒక్కటైతేనే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని, తద్వారానే బానిసత్వం తొలగి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన నెరవేరుతుందని కౌశిక్ పిలుపునిచ్చారు. నోటుకు ఆశపడకుండా, ఓటు అనే ఆయుధాన్ని సరైన విధంగా వినియోగించి, తమ బిడ్డల భవిష్యత్తుకు పునాదులు వేయాలని మండల ప్రజానీకానికి ఆయన విజ్ఞప్తి చేశారు. బీఎస్పీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

**పార్టీలో చేరికలు:**

ఈ సందర్భంగా, బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై సింగసముద్రం గ్రామ నివాసి సోయం శ్రీమూర్తులు పార్టీలో చేరారు. ఆయనకు మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, కార్యదర్శి గుర్రాల విజయ్, కోశాధికారి భాష, సోషల్ మీడియా ఇంచార్జ్ చెన్నం పవన్, ఈసీ మెంబెర్ పంబీ కుమారి, ములకల సాయి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 'టాస్క్ ఫోర్స్' కొరడా

- **రూ. 10 లక్షల అక్రమ టపాసులు సీజ్,**
- **నలుగురిపై కేసు నమోదు!**

**భద్రాచలం అక్టోబర్ 08 ( డిడి9 వార్త)**

దీపావళి పండుగ సందర్భంగా అక్రమంగా టపాసుల నిల్వలకు పాల్పడుతున్న వారిపై జిల్లా టాస్క్ ఫోర్స్ మరియు భద్రాచలం పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగాయి.

**జనావాస ప్రాంతాల్లో భారీగా అక్రమ నిల్వలు**

భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా మరియు గ్యాస్ గోడౌన్ ఏరియాల వంటి జనావాస ప్రాంతాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, భద్రతా నిబంధనలు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన భారీ మొత్తంలో టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ. 10 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం**

ఈ దాడుల్లో సుమారుగా పది లక్షల రూపాయల విలువ గల దీపావళి టపాసులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిల్వలకు పాల్పడిన నలుగురు వ్యక్తులపై భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

**- భద్రాచలం సీఐ నాగరాజు హెచ్చరిక**

దీనిపై భద్రాచలం సీఐ నాగరాజు మాట్లాడుతూ... "ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా, నియమ నిబంధనలను పాటించకుండా దీపావళి టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది" అని హెచ్చరించారు. గతంలో నివాస ప్రాంతాలలో ఉంచిన ఇలాంటి అక్రమ టపాసుల నిల్వల కారణంగా అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవించి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తు చేశారు. ప్రజాహితార్థం ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

**- నియమాలు పాటించండి:**

దీపావళి టపాసుల నిల్వ మరియు అమ్మకాల విషయంలో ప్రభుత్వ అనుమతులు మరియు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలి.

**- ప్రజలు అప్రమత్తంగా ఉండండి**

మీ ప్రాంతంలో ఎవరైనా ఈ విధంగా టపాసులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిస్తే, వెంటనే డయల్ 100 నకు గానీ, లేదా స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించగలరు. అగ్ని ప్రమాదాల నుండి మీ ప్రాంతాన్ని, ప్రజలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**- నివాస ప్రాంతాల్లో ప్రమాదకరం**

జనావాసాలు, ఇరుకైన సందులు, నివాస ప్రాంతాలలో టపాసులను నిల్వ ఉంచడం అత్యంత ప్రమాదకరం మరియు చట్టరీత్యా నేరం అని తెలిపారు.








# లక్ష్మీ కాలనీ లో ఆరోగ్య శిబిరం

**చర్ల, అక్టోబర్ 8( డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రంలో ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చర్ల (కొయ్యూరు) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, లక్ష్మీ కాలనీ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరం లో వివిధ చిరు వ్యాధులతో బాధపడుతున్న యాభై నాలుగు (54) మంది రోగులను పరీక్షించి వైద్యం అందించారు. ఈ క్యాంప్ లో డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుతం అన్నీ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయ్యవద్దని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని, అవసరమైతే రక్తనమూనాలు సేకరించి వాటిని పరీక్షించి వ్యాధిని కనిపెట్టి దానికి తగిన విధంగా వైద్యం అందిస్తామని, అన్నీ రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

బిపి, షుగర్ ఉన్నవాళ్లు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, నిర్లక్ష్యం చేయకుండా కనీసం మూడు నెలలకు ఒక్కసారైనా పరీక్షలు చేయించుకోవాలని అలాగే వ్యాయామం లేదా వాకింగ్ చేయాలని తెలిపారు. ఇప్పుడు అన్నీ రకాల పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రి లో అందుబాటులో ఉన్నాయని, అందరు పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. అనంతరం కేజీబీవీ హాస్టల్ ను సందర్శించి విద్యార్థులకు "పరిసరాల పరిశుభ్రత","వ్యక్తిగత పరిశుభ్రత" పై అవగాహన కల్పించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూత్రాన్ని అందరూ పాటించాలని, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాం ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, ఆశ కార్యకర్తలు రంగమ్మ, కృష్ణవేణి లు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి 69వ SGF పాఠశాలల క్రీడలు అట్టహాసంగా ప్రారంభం

- **క్రీడల ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**కొత్తగూడెం, అక్టోబర్ 08 ( డిడి9 వార్త )**

భద్రాద్రి జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తూ, జిల్లాస్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) పాఠశాలల క్రీడలు కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం మైదానం నందు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భద్రాద్రి జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, గెలుపోటములు సహజం అని, విజేతలైన క్రీడాకారులు రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, ప్రతి క్రీడాకారుడు క్రీడల ద్వారానే బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా డివైఎస్ఓ ద్వారా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు.



**పోటీల వివరాలు:**

ఈ పోటీలను బుధవారం మరియు గురువారం రెండు రోజులపాటు నిర్వహించనున్నారు.

బుధవారం 17 సంవత్సరాల విభాగంలోని బాలురు, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో మరియు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.

గురువారం 14 సంవత్సరాలలోపు బాల బాలకులకు పైన పేర్కొన్న క్రీడల్లోనే పోటీలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా SGF సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి, తరువాత ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ ప్రారంభ కార్యక్రమంలో DYSO పరంధామ రెడ్డి, DCEB సెక్రెటరీ నీరజ తో పాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులైన ప్రేమ్ కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, పామర్తి శ్రీనివాస్ లు అంపైర్లుగా వ్యవహరించారు.

# వెంకటాపురం ఎంపీడీవోగా పొదిలి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

- **కలెక్టర్ ఆదేశాల మేరకు నియామకం; రాజేంద్ర ప్రసాద్ సెలవుపై వెళ్లడంతో అదనపు బాధ్యతలు**

**వెంకటాపురం, అక్టోబర్ 8 (DD9 వార్త):**

వెంకటాపురం మండల ప్రజల అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) పొదిలి శ్రీనివాస్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రస్తుత ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అనారోగ్య కారణాల వలన సెలవుపై వెళ్లడంతో, ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఈ నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా, ప్రస్తుతం మంగపేట మండలంలో పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పొదిలి శ్రీనివాస్‌ను వెంకటాపురం ఎంపీడీవోగా అదనపు బాధ్యతల్లో నియమించారు.

బుధవారం శ్రీనివాస్ కొత్త బాధ్యతలు చేపట్టగా, స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్, మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

- **ములుగు జిల్లా కలెక్టర్**
- **దివాకర్ టిఎస్**

**డిడి 9 వార్త ములుగు**

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రారంభం నుండి ముగింపు వరకు సమర్ధవంతంగా నిర్వహణపై సిబ్బంది సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణపై ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ నుండి లెక్కింపు వరకు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు, అర్హతలు, పరిశీలన, గుర్తులు కేటాయింపు, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, కేంద్రాలు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు తదుపరి ఎన్నికల నిర్వహణలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అన్ని అంశాలపై ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిషా నిర్దేశం చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిబంధనల మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని, మారిన అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఏదైనా డౌట్స్ వస్తే చాలా సమస్యలు వస్తాయని, ముందు నుండే సమగ్రమైన స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం వల్ల ఎన్నికలను సమర్ధవంతంగా ఎలాంటి పొరపాటుకు నిర్వహించొచ్చని వివరించారు. ఎన్నికలు ట్రాన్స్పరెన్సీ, సక్సెస్ ఫుల్ గా జరగాలని ఆయన




స్పష్టం చేశారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో డి పి ఓ దేవ్ రాజ్, ఆర్వోలు, ఏఆర్వోలు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రేగుబల్లిలో విజయవంతంగా వెటర్నరీ క్యాంప్ నిర్వహణ

**భద్రాచలం, అక్టోబర్ 8 డిడి 9 వార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం (26439) గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల ఆరోగ్య సంరక్షణపై తన సేవా దృక్పథాన్ని మరోసారి చాటుకుంది. క్లబ్ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండలం, రేగుబల్లిలోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్ నందు ఈరోజు ఉదయం పశువుల కోసం ఒక ఉచిత వెటర్నరీ క్యాంప్ నిర్వహించబడింది.

ఈ క్యాంప్‌లో రేగుబల్లి, పరిసర గ్రామాల నుండి వచ్చిన పశువులకు ముఖ్యంగా ఆవులు, బర్రెలు, గేదెలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అంతేకాకుండా, పశువుల యజమానులకు అవసరమైన టీకాలు వేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ సేవా కార్యక్రమానికి డా. ఎన్. లికితా మరియు చర్ల వైద్యురాలు డా. కె. సుధారాణి వైద్య సేవలు అందించి సహకారం అందించారు. వారికి రోటరీ క్లబ్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షురాలు వి. వరలక్ష్మి సెక్రటరీ CA పి. బాల శ్ర కృష్ణ మహేంద్ర , కోశాధికారి పి. హరి ప్రసన్న కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ షేక్ అజీమ్ , ప్రోగ్రాం చైర్మన్ మల్లికార్జున రావు దగ్గరుండి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు యశోదా రాంబాబు , ప్రభాకర్ గుప్తా జక్కరయ్య, మధుసూదనరావు , మరియు సభ్యులు చలపతి , రాజశేఖర్, సంబశివరావు, విక్టోరియా, ఎల్.ఎన్. శేషుకుమార్ చురుకుగా పాల్గొని సేవలు అందించారు. పశువుల ఆరోగ్య సంరక్షణపై రూరల్ కమ్యూనిటీలో అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం క్లబ్ యొక్క లక్ష్యానికి అనుగుణంగా విజయవంతమైందని రోటరీ ప్రతినిధులు తెలిపారు.



## మేడారం ప్రాంగణ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

**డిడి 9 వార్త ములుగు**

బుధవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఈ ఎన్ సి ప్రహరీ గోడ మార్కింగ్ ను కలెక్టర్ కు చూపించి పని పురోగతి ప్రణాళిక గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం ప్రాంగణ అభివృద్ధి పనులలో భాగస్వాములైన అధికారులతో కలసి ప్రారంభించబడిన అభివృద్ధి పనులను నిశితంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం మరియు భక్తుల రద్దీకి సంబంధించి చెయవలసిన పనుల పై పలు సూచనలను అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఎన్నికల విధులు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం, అక్టోబర్ 08, (డిడి9 వార్త )**



త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల విధులను ప్రతి అధికారి సమర్థవంతంగా మరియు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణ వంటి కీలక అంశాలపై సమీక్షించారు.

**విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు: కలెక్టర్ హెచ్చరిక**

ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తమ బాధ్యతను కట్టుదిట్టంగా, సమన్వయంతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా విధులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంసీసీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు**

వెబ్ కాస్టింగ్, కేంద్రాల గుర్తింపు

పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించి సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలి.

**నామినేషన్ ఏర్పాట్లు:**

మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలి. ఎంపీడీఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, అభ్యర్థులు నామినేషన్ ఫారాలను ముందుగానే తనిఖీ చేసుకునే సౌకర్యం కల్పించాలి.

**ఆన్‌లైన్ అప్‌లోడ్:**

రిటర్నింగ్ ఆఫీసర్లు స్వీకరించిన నామినేషన్లను అదే రోజు TePoll సైట్‌లో అప్‌లోడ్ చేసి, ప్రతి రోజు సాయంత్రం నాటికి రోజువారీ నివేదికలు సమర్పించాలి.

**బ్యాలెట్ పేపర్**

తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత తెలుగు వర్ణమాల క్రమంలో ఖచ్చితత్వంతో బ్యాలెట్ పేపర్ తయారీ, ముద్రణ చేపట్టాలి.

**పోలింగ్ సామాగ్రి**

పోలింగ్ సామాగ్రిని కేంద్రాల వారీగా వేరు చేసి భద్రంగా ఉంచాలని ఎంపీడీఓలను ఆదేశించారు. అనుమతులు తప్పనిసరి: ర్యాలీలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించి SHO/CIల నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.

**నామినేషన్ల షెడ్యూల్:**

కలెక్టర్ వెల్లడించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం:

నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9 (ఉదయం 10.30 గం.) నుండి అక్టోబర్ 11 (సాయంత్రం 5.00 గం.) వరకు.

నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 12.

నామినేషన్ల ఉపసంహరణకు గడువు: అక్టోబర్ 15 (మధ్యాహ్నం 3.00 గం. వరకు).

ZPTC నామినేషన్ల ప్రక్రియ RDO/సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు సహా పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఏసీ బస్సులో గంజాయి స్మగ్లింగ్

- **ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న రూ. 11 లక్షల విలువైన 20 కేజీల గంజాయి స్వాధీనం**
- **గతంలోనూ పట్టుబడిన నిందితుడి అరెస్ట్**

**రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం**

**మెరుపుదాడి**

హైదరాబాద్ అక్టోబర్ 08 (డిడి9 వార్త ) ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వోల్వో ఏసీ బస్సులో తరలిస్తున్న సుమారు రూ. 11 లక్షల విలువైన 20.600 కిలోల గంజాయిని రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఒడిశాకు చెందిన ఓ నిందితుడిని అరెస్ట్ చేశారు.

**రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద పట్టుబడ్డ స్మగ్లర్**

వివరాల్లోకి వెళితే... ఒడిశాకు చెందిన నాభిన్ నాయక్ అలియాస్ హరి అనే వ్యక్తి, నాలుగు బ్యాగుల్లో 20 కేజీలకు పైగా గంజాయిని నింపుకొని, వోల్వో ఏసీ బస్సులోని లగేజ్ బాక్స్‌లో పెట్టి, దర్జాగా కూర్చొని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు. గతంలో కూడా భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడిన నాభిన్ నాయక్, మళ్లీ గంజాయిని తీసుకువస్తున్నాడనే పక్కా సమాచారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్గాలకు అందింది. ఈ సమాచారం మేరకు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఈఎస్ జీవన్ కిరణ్, సీఐలు సుభాష్ చందర్, ఇతర సిబ్బందితో కలిసి రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో ఆ బస్సును అడ్డగించి తనిఖీలు నిర్వహించారు. లగేజ్ బాక్స్‌లో తనిఖీ చేయగా, నాలుగు బ్యాగుల్లో ఉన్న గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**గంజాయి విలువ రూ. 11 లక్షలు**

స్వాధీనం చేసుకున్న గంజాయిని తూకం వేయగా అది 20.600 కేజీలు ఉన్నట్లు నిర్ధారించారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ. 11 లక్షల మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడు నాభిన్ నాయక్‌ను, స్వాధీనం చేసుకున్న గంజాయిని హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అధికారులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు. గంజాయిని చాకచక్యంగా పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలో ఏఈఎస్ జీవన్ కిరణ్, సీఐలు సుభాష్ చందర్, బాలరాజు,

ఎస్ఐలు వెంకట్, రవి, అఖిల్ తో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు. దాడుల్లో పాల్గొన్న అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్లు ప్రత్యేకంగా అభినందించారు.



## తృటిలో పెను ప్రమాదం నుంచి బయటపడ్డ కాంగ్రెస్ నాయకుడు బిజ్జం వెంకటేశ్వర రెడ్డి

**బూర్గంపాడు , అక్టోబర్ 08 (డిడి9 వార్త )**




బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు బిజ్జం వెంకటేశ్వర రెడ్డి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. గుర్తుతెలియని లారీ ఆయన ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టి, కనీసం ఆపకుండా పారిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది.

మండల కేంద్రానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వెంకటేశ్వర రెడ్డి తన వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో ప్రయాణిస్తుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ ఆయన కారును ఢీకొట్టింది. ఈ ధాటికి కారు వెనుక భాగం తీవ్రంగా దెబ్బతింది. అయితే, అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర రెడ్డికి, డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే, లారీ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి, "పక్కన పెడతానని" చెప్పి, కనీసం క్షమాపణ కూడా చెప్పకుండా, వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. లారీ నంబర్‌ను గుర్తించేలోపే డ్రైవర్ వాహనాన్ని అపకుండా పారిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బిజ్జం వెంకటేశ్వర రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, లారీ నంబర్, డ్రైవర్ వివరాల కోసం గాలిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడి కారు ప్రమాదానికి గురైందన్న విషయం తెలియగానే స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘటన స్థలానికి చేరుకున్నారు.



# అత్యాశలో అవినీతి సీఐ

- ఎస్ఐగా పనిచేసిన చోటే..ఎస్ హెచ్ ఓగా చేయాలని తహతహ
- ఆయన టార్గెట్ అంతా ..ఫోకల్ పోస్టింగుల పైనే
- ఏళ్లుగా సిటీలోనే తిష్ట.. మ్యానేజ్ చేస్తూ చక్రం తిప్పుతున్న సీఐ
- పోలీసు బాస్ లకు ఫోన్ కాల్స్ చేయించడంలో నేర్పరి
- పైకి సమాజసేవ.. తెరవెనుక లక్షల్లో సంపాదన
- హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ లో.. చర్చనీయాంశంగా మారిన సీఐ వ్యవహారం

**అత్యాశలో ఆ సీఐ ఎవరికి సరిపోరూ..ఎస్సైగా పనిచేసిన చోటే.. సీఐగా పనిచేయాలన్నదే ఆయన టార్గెట్. అందుకోసం ఎంతకైనా వెనుకాడడు. ఎవరినైనా మ్యానేజ్ చేసేస్తాడు. ఓ ప్రైవేటు వ్యక్తి అండతో, రాజకీయ పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతూ ఆయన పనిచేస పోలీసు కమిషనరేట్ బాస్ కు ఫోన్లు చేయిస్తూ.. తాను అనుకున్న చోట పోస్టింగ్ పొందేందుకు చేయని ప్రయత్నం లేదు. అలా పోస్టింగు తీసుకున్న అనంతరం మూడేళ్లకు మించి ఆ సీటు వదలకుండా, పైకి సమాజసేవ.. తెరవెనుక మాత్రం లక్షల్లో చేతులు చాచడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఓ సీఐ వ్యవహారం ప్రస్తుతం హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో చర్చనీయా ంశంగా మారింది. ఎస్సై నుంచి హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనే ఏళ్లుగా తిష్టవేసి, రాజకీయ నేతలకు సలాం కొడుతూ ఫోకల్ పోలీసు స్టేషన్లలో పనిచేసేందుకు చేసిన ప్రయత్నం..ఇటీవల బెడిసికొట్టడంతో ఆ సీఐ ప్రస్తుతం సందిగ్ధంలో పడినట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి.**

**-డిడి 9 వార్త హైదరాబాద్:**

పోస్టింగులు పొందడంలో తనకు తానే సాటి అనేలా ఫీల్ అయ్యే ఆ సీఐ వ్యవహారం ..సిటి పోలీసు కమిషనరేట్ పరిధిలో ట్రెండింగ్ గా మారింది. ఓ బీఆర్ఎస్ మంత్రి అండతో, సిటిలోనే కీలకమైన పోలీసు స్టేషన్ లో మూడేళ్లకు పైగా పనిచేసిన సదరు సీఐ, ఆ టైంలో బాగానే వెనుకేసుకున్నట్లు చెప్పుకుంటున్నారు. పైకి మాత్రం సమాజసేవ చేస్తున్నట్లు గా ప్రచారం కల్పించుకుని, తెరవెనుక మాత్రం ప్రతికేసులోనూ రేటు ఫిక్స్ చేసి జేబులు నింపుకున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నలుగురు కలిసి ఓ టీమ్ గా ఏర్పడి, ప్రతి కేసును సదురు సీఐ అండతో డీల్ చేసేవారని చెప్పుకుంటున్నారు. అలాంటి సీఐకి ఫోకల్ పోస్టింగులపై కన్నేసి, ఉన్నతాధికారులనే ఒత్తిడికి గురిచేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## నచ్చిన చోట పోస్టింగుకై.. అధికారులపై ఒత్తిడి

పోలీసుశాఖలో విధి నిర్వహణ సక్రమంగా చేపట్టే వారికి పోస్టింగులు అవే లభిస్తాయనేది వాస్తవంగా చెప్పుకుంటారు. ఎంతటి పొలిటికల్ పరిచయాలు ఉన్నా కూడా.. ఆరోపణలు ఉంటే ఎవరూ వాటిని అంగీకరించారు. కానీ ఇవన్ని మరిచిన ఓ సీఐ, తానెంటో నిరూపించుకునేందుకు పెద్ద స్కెచ్ వేశాడు. మీడియాపేరు చెప్పుకుంటూ చెలామణి అయ్యే ఓ ప్రైవేటు వ్యక్తి అండతో రాజకీయ కీలక నేతతో.. పోలీసు ఉన్నతాదికారులపై ఒత్తిడి తెచ్చి, ఫోకల్ పోస్టింగుపై గురిపెట్టాడు. కానీ అధికారులకు సదురు సీఐ వ్యవహారం తెలియడంతో అయనను మరోచోటుకు బదిలీ చేశారు. దీంతో ప్రస్తుతం ఆ సీఐ వ్యవహారం పోలీసుశాఖలో ట్రెండింగ్ మారిందనే చెప్పాలి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ ను వదలకుండా, ఎస్సైగా పనిచేసిన చోటే సీఐగా పనిచేయాలన్న టార్గెట్ తో, అనేక రకాలుగా అడ్డదారులు తొక్కుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ అనుకూలంగా, నగర మాజీ మంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సదురు సీఐ, ప్రస్తుతం రూట్ మార్చి, అధికార పార్టీ నాయకుల అండతో ఎస్ హెచ్ ఓగా అదికూడా ఆయన కోరుకున్న ఫోకల్ పోలీసు స్టేషన్ లో కొనసాగేలా ప్రయత్నాలు చేయడం దుమారం లేపుతోంది.

## వసూళ్లలో ఆయన రూటే..సపరేటు

ఎక్కడ పనిచేసినా ఆయన వసూళ్లు, చేతులు చాచటం ఊహకందని స్థాయిలో ఉంటాయని సిబ్బంది చెబుతున్నారు. ఏ కేసులో ఎలా డబ్బులు రాబట్టలనేది ఆయనకు తెలిసిన విద్య అని మాట్లాడుకుంటున్నారు. పోలీసుశాఖలో చేరినప్పటి నుంచి ఆయన నమ్మకస్తులుగా ఉన్న నలుగురు వ్యక్తులతోనే ఆయన సెటిల్ మెంట్ వ్యవహారాలు సాగుతాయని, అలా సంపాదించిన దాంట్లో నుంచి సామాజిక సేవ పేరుతో ప్రచారం కల్పించుకుని ఉన్నతాధికారుల వద్ద మార్కులు కొట్టేసే ప్రయత్నం చేస్తాడని చర్చించుకుంటున్నారు. అంతేకాదు తప్పుడు ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడమే కాకుండా, సివిల్ వివాదాలను పరిష్కరించడంలో ఆయన ఆసక్తి చూపి అనంతరం అందుకు తగ్గ ఫీజును వసూలు చేయడంలో మూడో కంటికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటారని చెబుతున్నారు. పై అధికారులను మేనేజ్ చేస్తూ, ఎక్కడ పనిచేసిన సరే లాంగ్ స్టాండింగ్ అనేలా ముద్ర వేసుకుంటాడని చెబుతున్నారు. మరోవైపు గత సీపీ హాయంలోనూ సదరు సీఐ, అనేక రకాలుగా పోస్టింగుకై ఒత్తిడి తేవడంతో, సీఐను నాన్ ఫోకల్ , లా అండ్ ఆర్డర్ కానీ విభాగానికి బదిలీ చేసినా ఆయన తీరు మారకపోవడంతో ఉన్నతాధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. కాగా గతంలో సదురు సీఐ ఎక్కడెక్కడ పనిచేశాడు.. ఆ సమయంలో సీఐ చేసిన వ్యవహారం, ఫిర్యాదులు , కలెక్షన్లకు సంబంధించిన ఆరోపణలపై ప్రస్తుతం లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.